
VB PUBLICATIONS
షాడో ఇన్ బాగ్దాద్
మధుబాబు

# షాడో ఇన్ బాగ్దాద్

రచన

మధుబాబు

Kinige

© Author
© Madhu Baabu
This digital book is published by -
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# షాడో ఇన్ బాగ్దాద్

తడి ఆరని కురులను టర్కీ టవల్ తో తుడుచుకుంటూ బాత్‌రూమ్ నుంచి బయటికి వచ్చింది బిందు.

కిచెన్ లోకి పోతూ, "లేచావా?" అని పిలిచింది.

సమాధానం రాలేదు బెడ్ రూమ్ లో నుంచి.

"నీ సంగతి నాకు బాగా తెలుసు. నిన్ను నిద్ర ఎలా లేపాలో నేను ఎరుగుదును" ఫ్లాస్కులో వున్న కాఫీని కప్పులోకి వంచుతూ హెచ్చరించింది.

తల దగ్గర్నించి పాదాలదాకా ముసుగు పెట్టి గాఢనిద్దురలో వున్నాడు షాడో. ఆమె మాటలు అతని చెవికి చేరిన సూచనలు కనిపించటం లేదు.

"నేను బెడ్ దగ్గరికి వచ్చేలోగా లేచి కూర్చోకపోతే కప్పులో వున్న కాఫీ అంతా నీ ముఖం మీద ఒలుకుతుంది......" సీరియస్‌గా మరో హెచ్చరిక చేసింది బిందు బెడ్ రూమ్ వైపు బయలుదేరుతూ.

ఆ మాటకు కూడా సమాధానం రాలేదు షాడో దగ్గిర్నించి, అతని పాదాల దగ్గిర ముడుచుకు పడుకొని వున్న ఫెడ్రోకి మాత్రం ముంచుకు వచ్చేసింది విపరీతమయిన రోషం.

తను.....దిగ్రేట్ సమురాయ్ హంటింగ్ డాగ్ అక్కడ వుండగా కొంచెం కూడా భయం లేకుండా అలా బెదిరించటమా?

నిటారుగా లేచి నిలబడింది జానెడు కూడా లేని దాని తోక! వచ్చీరానట్లున్న కోరపళ్ళు బయటికి కనపడేలా నోరు తెరిచి, చెవులు గింగుర్లు ఎత్తేలా గంయ్ న అరిచింది.

ఉలిక్కిపడి చేతిలోని కప్పును వదిలేసినంత పనిచేసింది బిందు.

"పొద్దున్నే నిద్రలేవాల్సి వస్తుందని ఆ దరిద్రపు ముఖాన్ని కాపలా పెట్టుకున్నావా? ఉండు.... దాని పని చెపుతాను....." అంటూ గిరుక్కున వెనుతిరిగి కిచెన్ లోకి వెళ్ళింది.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా లేచి కూర్చున్నాడు షాడో.

"పారిపోరా బ్లడీ యిడియట్! ఇక్కడే వుంటే నీ నెత్తి బొప్పెలు కట్టేస్తుంది ఈ రోజు....." అంటూ ఫెడ్రో తోక పట్టుకుని, మంచం మీద నుంచి ద్వారంలో పడేటట్లు విసిరేశాడు.

రెండు మూరల పొడవున్న ప్లాస్టిక్ గొట్టానొకదాన్ని పట్టుకొని కిచెన్ లోంచి బయటికి వచ్చింది బిందు. పిల్లిలా అడుగులు వేస్తూ బయటికి జారుకుంటున్న ఫెడ్రోని గమనించి వెంట పడింది.

పిల్లి నడకను మానేసి, సుడిగాలిలా పరుగు తీసింది ఫెడ్రో. డ్రాయింగ్ రూమ్ నుంచి, పోర్టికోలోకి పోయి అక్కడి నుంచి బంగ్లా ముందున్న పూపొదల్లో మాయం అయింది.

"నిన్ను వదిలి పెడతానని అనుకుంటున్నావా?" అంటూ డ్రాయింగ్ రూమ్ లోకి తొంగి చూసి జూజీని పిలిచింది బిందు.

మెత్తటి సోఫాలో పడుకుని అరమూసిన కనులతో విశ్రాంతి తీసుకుంటోంది జూజీ. బిందు పిలుపు వినబడి మరుక్షణం క్రిందికి దూకి నాలుగు అంగల్లో ఆమెను సమీపించింది.

"కాచ్ దట్ రాస్కెల్.....కాచ్ హిమ్......" పొదలవైపు చేయి చూపిస్తూ కమాండ్ చేసింది బిందు.

రాస్కెల్ అంటే ఎవరో, ఆమె చేతిలోని ప్లాస్టిక్ గొట్టం ఎవరికోసమో జూజీకి బాగా తెలుసు. అందుకే తొందర పడకుండా పొదల్లోకి పోయి ఒక గులాబీ చెట్టు దగ్గర మాటు వేసింది.

రెండు నిమిషాల తరువాత ధైర్యంగా తల బయటికి పెట్టింది ఫెడ్రో – పగిలిపోయిన ఒక పూలకుండీలో నుంచి.

పెద్ద పులిలా పోయి కుండీ మీద పడింది జూజీ. దెబ్బ తగిలిన చుంచులా అరిచి పారిపోవటానికి ప్రయత్నించిన ఫెడ్రోని చటుక్కున నోట కరుచుకొని బిందు దగ్గరికి తీసుకు వచ్చింది.

ప్లాస్టిక్ గొట్టంతో టపటపా రెండు వడ్డించింది బిందు. చెవులు పట్టుకొని లాక్కుపోయి డ్రాయింగ్ రూమ్ లో వున్న గొలుసును మెడకు తగిలించింది.

ప్లాస్టిక్ గొట్టపు దెబ్బలకు భయపడలేదు ఫెడ్రో. చెవులు మెలిపెట్టినా లెక్క చేయలేదు. గొలుసు మెడకు చుట్టుకునే సరికి తన ప్రిస్టేజి అంతా గంగపాలు అయినట్లు గోల మొదలుపెట్టింది. క్రిందపడి దొర్లుతూ డ్రాయింగ్ రూమ్ దద్దరిల్లిపోయేటట్లు అరవటం ప్రారంభించింది.

ఒక్కగంతులో మంచం మీద నుంచి దిగాడు షాడో. "పాపం దాన్ని వదిలేయ్ బిందూ! పొద్దున్నే ఎందుక ఏడిపిస్తావ్?" అంటూ ద్వారం వైపు చూసి నాలుక కొరుక్కున్నాడు. ఎంత వేగంగా దిగాడో, అంతకు రెట్టింపు వేగంతో మంచం ఎక్కేసే వాడే గాని, రెండు అంగల్లో వచ్చి షర్టు కాలర్ ని గట్టిగా పట్టుకుంది బిందు.

"నిన్ను నిద్రలేపటం నాకు చేతకాదని నీ భ్రమ. నువ్వు షాడో వైతే నేను మిసెస్ షాడోననే విషయం మర్చిపోకు" అంటూ కాఫీ కప్పును అతని చేతికి అందించింది.

అందుకున్నట్లే అందుకుని ఆ కప్పును క్రింద పెట్టేశాడు షాడో. ప్రక్కకు తిరగబోతున్న బిందు నడుము చుట్టూ చేతులు చుట్టి దగ్గిరికి లాక్కున్నాడు.

"ఛీ......ఛీ.....! రాను రాను నీకు మతిపోతోంది. వేళాపాళా లేకుండా ఏమిటి మోటు సరసం!" విడిపించు కోవటానికి విశ్వప్రయత్నం చేస్తూ ప్రొటెస్ట్ చేసిందామె.

విడిచి పెట్టే ఉద్దేశ్యం షాడోకి లేదు. మరింత గట్టిగా పట్టుకొని పెదవుల మీదికి వంగాడు.

సరిగ్గా అదే సమయంలో వేగంగా ముందుకు వచ్చి సడన్ బ్రేకుతో ఆగింది కులకర్ణి గారి వైట్ అంబాసిడర్. క్రిందికి దిగకుండానే హారన్ని అదిమిపెట్టి చెవులు చిల్లులు పడేటట్లు మ్రోగించాడు డ్రయివర్ చంద్ర.

విపరీతమైన కోపంతో ఎర్రగా కందిపోయింది బిందు వదనం.

“ఎవరైనా కొంచెం సేపు ఏకాంతంగా వుండటం మీ ముసలి బాస్‌కి ఇష్టం వుండదని నాకు బాగా తెలుసు. మీ సి.ఐ.బి. వాళ్ళకి పెళ్ళాం, పిల్లలు అవసరం లేదు. పోయి ఆయనతోనే కాపురం చేయి “ అంటూ విసురుగా షాడో చేతుల్ని విదిలించుకుని విసవిసా కిచెన్ లోకి వెళ్ళిపోయింది.

క్రింద పెట్టిన కాఫీ కప్పుని అందుకొని రెండుగుక్కల్లో ఖాళీ చేశాడు షాడో. పది నిమిషాల్లో కాలకృత్యాలు తీర్చుకొని పరుగు పరుగున పోయి అంబాసిడర్ ఎక్కాడు.

వెంటనే వెనుతిరిగింది అంబాసిడర్. సరిగ్గా నలభై అయిదు నిమిషాల తరువాత ఓల్డ్ టౌన్‌లో వున్న హోమ్ మినిస్టర్ గారి బంగ్లాముందు ఆగింది.

## 2

“కమాన్ భాయ్! కమాన్! నీ కోసమే ఎదురు చూస్తున్నాము” అంటూ పోర్టికోలోనే షాడోకి ఎదురు వచ్చారు హోమ్ మినిష్టర్ గారు.

అంబాసిడర్ దిగి షర్టు మడతల్ని సరిచేసుకొంటూ మెట్లు ఎక్కబోతున్న షాడో ఎలా వున్నవాడు అలాగే ఆగిపోయాడు.

ఎప్పుడూ లేనిది ఒక విధమైన ఉత్సాహంతో వెలిగిపోతోంది హోమ్ మినిస్టర్ గారి వదనం. విపరీతమైన ఆలోచనలతో విసుగ్గా వినిపించే ఆయన కంఠంలో ఏదో క్రొత్తదనం, గుర్తుపట్టటానికి వీలు లేని హుందాతనం వినిపిస్తోంది.

"లోపలికి రమ్మని ఒకసారి చెపితే నీకు వినబడదా? హారతి పళ్ళెం తీసుకు వచ్చి స్వాగతం పలికితే గాని అడుగు ముందుకు పడదా?" ఖంగుమంటూ వినవచ్చింది కులకర్ణి గారి కంఠ స్వరం.

ఉలిక్కిపడి తన ఆలోచనల్లోంచి బయట పడ్డాడు షాడో. పరుగులాంటి నడకతో డ్రాయింగ్ రూమ్ లోకి అడుగు పెట్టాడు.

"హల్లో రాజూ! హౌ ఆర్ యూ!" అంటూ చటుక్కున ఒక సోఫా లో నుంచి లేచి అతనికి ఎదురు వచ్చాడు ఇంటర్ పోల్ డైరెక్టర్ల లో ఒకరైన ఫియరీ.

ఆయన వెనుకే షాడోని పలుకరించాడు ఆస్ట్రేలియన్ డైరెక్టర్.

ఓల్డు మాంక్ రమ్ బాటిల్స్ రెండింటినీ ఒకేసారి పట్టించేసినట్లు గిర్రున తిరిగిపోయింది షాడో తల.

అవసరం అయితే పారిస్ లో వున్న హెడ్క్వార్టర్స్ కి పిలిపించి మాట్లాడటం తప్ప ఎక్కడికీ కదలని ఇంటర్ పోల్ డైరెక్టర్లు – తనను వెతుక్కుంటూ ఇక్కడికి రావటమా!!

అతని ముఖంలో ప్రతిఫలించిన ఆశ్చర్యాన్ని గమనించి చిన్నగా నవ్వుతూ భుజం తట్టాడు ఫియరీ.

"ఉన్న ఆశ్చర్యాన్నంతా ఒకేసారి ఖర్చుపెట్టుకోవటం మంచిది కాదు. బైదిబై.... మీట్ మిస్టర్ అబ్దుల్ రజాక్.... పాకిస్తాన్ స్పెషల్ బ్రాంచి డయరెక్టర్....." అంటూ మౌనంగా కూర్చుని వున్న మరో వ్యక్తిని పరిచయం చేశాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2129**

* * *

**Read other books of Madhu Babu @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Madhu+babu&id=20**